VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 11

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 7 జూన్ 2026



## రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తాను - లింగమనేని రమేష్





**విజయవాడ,కలంకౌంటర్ :** రాజ్యసభకు జనసేన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం లింగమనేని రమేష్ మీడియాతో మాట్లాడారు. "తనపై నమ్మకంతో రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు. రాజ్యసభ వేదికగా రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాను" అని రమేష్ చెప్పారు.

**లింగమనేని రమేష్ సరైన వ్యక్తి - జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు..** జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు నాగబాబు మాట్లాడుతూ... "జనసేన పార్టీ తరఫున లింగమనేని రమేశ్ రాజ్యసభకు వెళ్లడం తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ఆయన సరైన వ్యక్తి. ఈ ఎంపిక పట్ల జనసేన పార్టీ శ్రేణులంతా ఎంతో సంతోషంగా ఉన్నాయి" అన్నారు.

## పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపిన లింగమనేని





**అమరావతి,కలంకౌంటర్ :** రాజ్యసభకు జనసేన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నేతలతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

-కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.



**తిరుపతి,కలంకౌంటర్ :** భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి (ఎఫ్.ఏ.సి) తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈట్ స్ట్రీట్ సమీపంలోని డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. భవిష్యత్ తరాలకు సంపూర్ణమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ప్రకృతిని కాలుష్యం నుండి కాపాడుకుందాం అనే నినాదంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం బారి నుండి మన భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్క పౌరుడి కనీస బాధ్యత అని తెలిపారు. పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, పచ్చని ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని బహుమతిగా అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.





టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ లతో కాఫీ కబుర్లు సమావేశంలో పాల్గొన్న టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

-మంగళగిరి,కలంకౌంటర్ :

# స్కూలు 21ని సందర్శించిన ఏపీ విద్యా మంత్రి నారా లోకేష్

● మాస్కోలో టీచర్లు లేని వినూత్నమైన భవిష్యత్ పాఠశాల ● తోటి విద్యార్థులే అధ్యాపకులు...ప్రాజెక్టు ఆధారిత పాఠాలు











**మాస్కో (రష్యా),కలంకౌంటర్ :** మాస్కోలో స్బేర్ ఆధ్వర్యంలో నడుస్తున్న విభిన్నమైన పాఠశాల స్కూల్ 21ను ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. సాంప్రదాయ విద్యావిధానానికి భిన్నంగా అక్కడ అనుసరిస్తున్న విధానాలను నిర్వాహకులు, విద్యార్థుల ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. స్కూల్ 21 అనేది రష్యాలో స్బేర్‌బ్యాంక్ ప్రారంభించిన ఉచిత ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విద్యా కార్యక్రమం. ఇక్కడ విద్యార్థుల నుంచి ఎటువంటి ట్యూషన్ ఫీజు వసూలు చేయరు. ఇది ఇంటర్నేషనల్ 42 నెట్‌వర్క్‌లో సభ్యత్వం కలిగి, స్వతంత్రంగా పనిచేస్తుంది, ఫ్రెంచ్ కోడింగ్ స్కూల్ అయిన ఎకోల్ 42 రూపొందించిన వినూత్నమైన "భవిష్యత్ పాఠశాల" విద్యా పద్ధతులను అనుసరిస్తుంది.

**స్కూల్ 21 ప్రధాన ప్రత్యేకతలు..**

**1. సాంప్రదాయ విద్యావిధానం లేదు:** ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక ఉపన్యాసాలు, సంప్రదాయ గ్రేడ్‌లు ఉండవు.

**2. సహచర విద్యార్థుల ద్వారా అభ్యసనం:** విద్యార్థులు పూర్తిగా గేమిఫైడ్, ప్రాజెక్ట్-ఆధారిత సహకార పనుల ద్వారా నేర్చుకుంటారు, ఒకరి కోడ్‌ను మరొకరు మూల్యాంకనం చేసుకుంటారు.

**3. ట్యూషన్-రహిత విధానం:** స్బేర్‌బ్యాంక్ ఈ ప్రోగ్రామ్‌కు పూర్తిగా నిధులు సమకూరుస్తుంది, దీనివల్ల ఎంపికైన అభ్యర్థులు ఎటువంటి ఖర్చు లేకుండా ఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చదవడానికి అవకాశం కలుగుతుంది.

**4. 24/7 సౌకర్యవంతమైన ప్రవేశం:** క్యాంపస్‌లు నిరంతరం పనిచేస్తాయి, దీనివల్ల విద్యార్థులు తమ సొంత అధ్యయన వేగాన్ని, షెడ్యూల్‌లను నిర్వహించుకోవచ్చు.

**విభిన్నమైన ఎంపిక ప్రక్రియ..** స్కూల్ 21లో ప్రవేశం కోసం ఎంపిక ప్రక్రియ వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. గత విద్యా ప్రతిభ, డిగ్రీలు లేదా ముందస్తు కోడింగ్ పరిజ్ఞానాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోరు. సాధారణ నమోదుకు ముందు దరఖాస్తుదారులు ఆన్‌లైన్ కాగ్నిటివ్ పరీక్షను పూర్తి చేయాలి. దాని తర్వాత, సమస్య పరిష్కార నైపుణ్యాలను, అనుకూలతలను అంచనా వేయడానికి "పిసిన్" (స్విమ్మింగ్ పూల్) అని పిలువబడే, అనేక వారాల పాటు జరిగే ఒక ఇంటెన్సివ్ ఆన్-సైట్ ఎంపిక శిబిరంలో పాల్గొనాలి. అక్కడ వారు ఇచ్చిన టాస్క్ లపై ప్రత్యక్షంగా ప్రదర్శించిన తెలివితేటలను బట్టి ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

## మహిళల భద్రత, రక్షణకే తొలి ప్రాధాన్యత కల్పించాలి

-రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత





**మార్కాపురం జిల్లా,కలంకౌంటర్ :** మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపడుతున్న మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పనితీరును రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పోలీసు అధికారులతో రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత కనిగిరిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, పోలీసు పరిపాలనా విభజన, సర్కిళ్లు, మండలాల పరిధి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రత, రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను పెంచే విధంగా అధికారులు తమ విధులను నిర్వహించాలని సూచించారు. మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితి హోం మంత్రి అనిత కు వివరించారు. ఈ సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యు. నాగరాజు, కనిగిరి ఇన్‌చార్జి డీఎస్పీ పి. శ్రీధర్, సిఐలు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ గా సబ్బిళ్ళ భవాని బాధ్యతలు స్వీకరణ



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండల నూతన తహసిల్దారు గా సబ్బిళ్ళ భవాని పదవి బాధ్యతలు స్వీకరించారు. గన్నవరం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ గా భవాని ప్రమోషన్ పై మోపిదేవి తహసిల్దార్ గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె మోపిదేవి తహసిల్దారుగా జాయిన్ అయ్యారు. పదవి బాధ్యతలు సేకరించారు. ఇప్పటివరకు ఇన్చార్జి తహసిల్దారుగా ముప్పిరి శెట్టి హరినాథ్ మచిలీపట్నం కలెక్టరేట్ కు ఆయన పోస్టుకు వెళ్లారు. నూతన తహ సిల్దార్ భవాని తొలిత మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# ఈ నెల 7 నుంచి యోగా పోటీలు..

● తొలిదశలో గ్రామ, వార్డు స్థాయిలో ఉత్సాహంగా ఆరంభం ● ఔత్సాహికులు పెద్దఎత్తున పాల్గొనాలి

● యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, కలంకౌంటర్ :** సమాజంలోని ప్రతి వర్గానికి యోగా పట్ల అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర-2026లో భాగంగా ఈ నెల 7 నుంచి యోగా పోటీలు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్ - గ్రాస్‌రూట్స్ వెల్‌నెస్ ఇతివృత్తంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విజేతలు మండల స్థాయికి, మండలస్థాయిలో విజేతలు జిల్లాస్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు యునిటీ త్రో యోగా-బ్రిడ్జింగ్ కమ్యూనిటీస్ థీమ్‌తో మండలస్థాయిలో, ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యోగా అండ్ యూత్ - బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో జిల్లాస్థాయిలో, ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు ఉంటాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉంటుందన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలు కూడా ఉంటాయని వివరించారు. జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జ్ఞానాధారిత పోటీలు మినహా మిగిలిన పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సత్కరించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలకు 84980 12833, 83413 64185 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## ఇంద్రకీలాద్రిపై రేపటి నుండి 14 రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం

**విజయవాడ, కలంకౌంటర్ :** దేవాదాయ శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని - రేపటి నుండి (జూన్ 07 నుండి జూన్ 21 వరకు) 14 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ తెలిపారు.

**కార్యక్రమ వివరాలు:** సమయం & వేదిక: జూన్ 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 7:00 గంటల నుండి 8:00 గంటల వరకు ఇంద్రకీలాద్రి పైనున్న మహా మండపం 6వ అంతస్తులో ఈ యోగా శిక్షణ జరుగుతుంది.

**నిపుణులచే శిక్షణ:** ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా అర్హులైన యోగా శిక్షకులను (Yoga Instructors) రప్పించి, వారి ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో యోగాసనాలు, ప్రాణాయామం వంటివి నేర్పించనున్నారు.

**భక్తులకు ఉచిత ప్రసాదం -- రిజిస్ట్రేషన్:** ఈ యోగా శిక్షణకు విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో పాల్గొనే భక్తుల వివరాలను విభాగం నమోదు చేయనుంది. ప్రతీ రోజు యోగా సాధన అనంతరం భక్తులందరికీ దేవస్థానం తరపున ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నారు. భక్తులందరికీ సరిపడా మంచినీరు, యోగా మ్యాట్స్ (ఫోమ్) వంటి మౌలిక వసతులను ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్నామని,రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అందరి బాధ్యత అని, ఆలయ పరిపాలనా విభాగం, సెక్యూరిటీ మరియు శానిటేషన్ విభాగానికి చెందిన ప్రతి ఒక్క సిబ్బంది, ఉద్యోగులు ఈ యోగా శిక్షణకు ప్రతి రోజు తప్పనిసరిగా హాజరు కావాలని ఈవో ఆదేశించారు. ఈ 14 రోజుల యోగా కార్యక్రమం గురించి ఆలయ ట్రస్ట్ చైర్మన్ కి, ట్రస్ట్ బోర్డు సభ్యులకు సమాచారం అందించి,అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొనేలా ఏర్పాట్లు చూడాలని ఈవో ఆదేశించారు.

## మలేరియా వ్యాధి నివారణకు అవగాహన ర్యాలీ



**కావలి,కలంకౌంటర్ :** సమాజంలో మలేరియా వ్యాధి నివారణకు ప్రజలు అవగాహన పెంచుకొని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పుల్లారెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఎం. శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మలేరియా వ్యాధి నివారణ మాసోత్సవాల సందర్భంగా పుల్లారెడ్డి నగర్ లో ర్యాలీని ప్రారంభించి ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో గాని, పట్టణ ప్రాంతంలో గాని, ప్రజలు మురుగునీటి గుంటలు టైర్లు ట్యూబుల్లో నీళ్లు నిలువ ఉండటం ద్వారా దోమలు గుడ్లు పెట్టి దోమలు పెరుగుతున్నాయని వాటి నివారణకు ఆ తొట్లలో ఉన్న నిలువ నీటిని తొలగించాలని కోరినారు.అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరినారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా విచ్చేసిన లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి మాట్లాడుతూ దోమలు నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా జీవించడానికి నిరంతరం కృషి చేయాలని కోరినారు ఆశా వర్కర్లు గ్రామాలకు వెళ్ళినప్పుడు అక్కడ ప్రజలను మలేరియా నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వాళ్ళకి అవగాహన కల్పించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మలేరియా నివారణ కావలి సబ్ యూనిట్ అధికారి టి. లక్ష్మీనరసయ్య, హెల్త్ సూపర్వైజర్ జి. ఝాన్సీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ,ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేసినారు.

# మచిలీపట్నం పై రైల్వే శాఖ నీలి నీడలు

## ఎంపీ సారూ.. జర చూడండి











**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కోట్ల రూపాయలతో మచిలీపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పరుస్తూ మరోపక్క ప్రయాణికులు వసతులు పై రైల్వే శాఖ నిర్లక్ష్యంపై మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తీవ్రంగా ఖండించారు. శనివారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంతో కాలంగా మచిలీపట్నం బీదర్ హైదరాబాద్ మీదగా వెళ్లే సూపర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కు గతంలో ఉన్న 14 స్లీపర్ భోగిలను ఏడు బోగీలు తగ్గించటం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. అదనపు ఆదాయం కోసం ఏసీ కోచ్ లు ను పెంచి మధ్యతరగతి ప్రయాణికులకు అందుబాటులో ఉన్న ఏడు స్లీపర్ భోగీలు తగ్గించడం వలన ప్రతిరోజు 500 మంది ప్రయాణికులకు ప్రయాణ అవకాశాలు లేకుండా పోయిందని బాలాజీ అన్నారు. జిల్లా ముఖ్య కేంద్రంలో అదనపు రైలు ఏర్పాటు చేయవలసి ఉండగా అమల్లో ఉన్న రైలుకు భోగిలను తొలగించడం ఏకపక్ష చర్యని బాలాజీ విమర్శించారు. విశాలమైన పొడుగు ప్లాట్‌ఫారాలు నిర్మించి మచిలీపట్నం నుంచి ఎంతో కాలంగా ఉన్న హైదరాబాదు బీదర్ రైలుకు 7 స్లీపర్ భోగీలు తగ్గించడం రైల్వే అధికారుల నిర్లక్ష్యం అని బాలాజీ అన్నారు. తక్షణమే హైదరాబాద్ బీదర్ ట్రైన్ కు తొలగించిన ఏడు స్లీపర్ భోగిలనుతిరిగి ఏర్పాటు చేయాలని, మచిలీపట్నం –తిరుపతి రైలు తక్షణమే అందుబాటులో తీసుకురావాలని కూడా బాలాజీ డిమాండ్ చేశారు. కేంద్ర పరిధిలో గల రైల్వే శాఖ మంత్రితో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాల సౌరి మాట్లాడి మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు రైల్వే అధికారులు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించాలని బాలాజీ కోరారు.

# మంత్రిని సన్మానించిన నాని





**తిరుపతి,కలంకౌంటర్ :** రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య లను తిరుపతి లో కలిసిన సందర్భంగా చిరు సత్కారం చేసిన మహాసభ మెంబర్ షిప్ కమిటీ చైర్మన్ చక్కా నాని.

# సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్య అన్నదాన పథకానికి విరాళం ఇచ్చిన దాతలు..

**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి మండలం మోపిదేవి గ్రామంలో స్వయంభు దేవాలయంగా విరిజిల్లుతున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్య అన్నదాన పథకానికి విజయవాడ వాస్తవ్యులు సిహెచ్ .వెంకటరామిరెడ్డి వాసవి దంపతులు శ్రీ స్వామివారి నిత్యాన్నదాన నిమిత్తం 1,05,116 రూపాయలు శనివారం నగదు రూపంలో దేవస్థానం ఆఫీస్ నందు ఆలయ సూపరింటెంట్ అచ్యుత మధుసూదన్ రావుకి అందజేశారు. అలాగే చిలకలూరిపేట వాస్తవ్యులు ఎం సి మనోజ్ ఉమా వైష్ణవి 970 గ్రాముల వెండి నాగపడగ స్వామివారికి సమర్పించి ఆలయ అధికారులకు అందజేశారు. వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.



# విజయవాడలో త్వరలో భారీ 'రాష్ట్ర స్థాయి సూఫీ కాన్ఫరెన్స్'

- 5,000 మంది ఫకీర్లతో బహిరంగ మహాసభ నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా ఇరాన్, ఇరాక్ దేశాల నుండి రానున్న ప్రముఖ అంతర్జాతీయ సూఫీ మత గురువులు



**అమరావతి,కలంకౌంటర్ :** విజయవాడ నగరంలో త్వరలోనే రాష్ట్ర స్థాయి భారీ సూఫీ కాన్ఫరెన్స్ మరియు బహిరంగ మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర సూఫీ మత పెద్దలు ప్రకటించారు. శ్రీ సత్యసాయి జిల్లా, పెనుగొండ నియోజకవర్గంలోని పవిత్ర హాజరత్ సయ్యద్ బాబా ఫక్రుద్దీన్ రహ్మతుల్లాహి అలైహి దర్గా షరీఫ్‌లో రాష్ట్రంలోని ప్రముఖ సూఫీ మత పెద్దలు, సజ్జాదా నషీన్‌లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు సూఫీ తాజ్ బాబా. ఆధ్వర్యంలో. మషాయిఖ్‌లు, పీఠాధిపతులు, ముతవల్లీలు మరియు మురీదుల ఉన్నత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ మహాసభ నిర్వహణకు సంబంధించిన తీర్మానాన్ని ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

**ఈ పత్రికా ప్రకటనలోని ముఖ్య విశేషాలు :** అంతర్జాతీయ ప్రతినిధుల రాక: ఈ మహాసభకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తూ, విదేశాలైన ఇరాన్ మరియు ఇరాక్ దేశాల నుండి ప్రముఖ సూఫీ మత గురువులు, అంతర్జాతీయ ఆధ్యాత్మిక వేత్తలు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు.

**5,000 మంది ఫకీర్ల భాగస్వామ్యం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 5,000 మంది ఫకీర్లు, జలాలీ పుఖ్రాలు, రిఫాయిలు, ముర్షిద్‌లు, బాన్వాలు, ఖలందరీలు ఈ మహాసభకు తరలిరానున్నారు.

**మహాసభ ముఖ్య లక్ష్యం:** సూఫీ సంప్రదాయాల పరిరక్షణ, మానవతా విలువల ప్రచారం, సర్వమత సౌహార్ద్రం (మత సామరస్యం) మరియు ఆధ్యాత్మిక చైతన్య విస్తరణే ధ్యేయంగా ఈ మహాసభ సాగనుంది.

**సమగ్ర కార్యాచరణ ప్రణాళిక:** మహాసభ విజయవంతం కోసం త్వరలోనే రాష్ట్ర కార్యవర్గాన్ని, అనంతరం జిల్లా స్థాయి కార్యవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని దర్గాల గురువులు, సజ్జాదా నషీన్‌లు మత పెద్దలతో సంప్రదింపులు జరిపి పూర్తి కార్యాచరణను రూపొందిస్తారు. పెనుగొండ దర్గాలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశానికి జాంపని అతా ముహమ్మద్ నిజాముద్దీన్ షా తాజ్ ఖాదరీ (హజరత్ తాజ్ బాబా) అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షులు కె.ఎం. షకీల్ షఫీ , ప్రధాన కార్యదర్శి ఉబేదుల్లా సాహెబ్ , తెనాలి ప్రాంత సూఫీ పెద్దలు మరియు రాష్ట్రంలోని వివిధ దర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రకటన జారీ చేసిన వారిలో సూఫీ అల్తాఫ్ అలీ రజా బాబా సూఫీ అతా నిజాముద్దీన్ బాబా సూఫీ కాన్ఫరెన్స్ నిర్వహణ కమిటీ ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి....




**కందుకూరు, కలంకౌంటర్ :** కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ లో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన భారీసభలో రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత , సాంఘికసంక్షేమ శాఖమంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి , మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు , ఇంకా పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితుడికి ఎల్.ఓ.సి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి .

**కావలి,కలంకౌంటర్ :** కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మన్నేపల్లి రోశయ్య అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి స్పందించి, బాధితుడికి వైద్య చికిత్స కోసం ఎల్.ఓ.సి (రావ్వతీ శీట జతీవసఱ) ద్వారా రూ.66,787 ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా సహకరించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సంబంధిత పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రోశయ్య కుటుంబసభ్యులుమాట్లాడుతూ, క్లిష్ట సమయంలో తమకు అండగా నిలిచి వైద్య సహాయం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు..



# మాలకొండ నూతన ఈ ఓ గా భాద్యతలు చేపట్టిన పి .శ్రీనువాసుల రెడ్డి





**కందుకూరు, కలంకౌంటర్ :** మాలకొండ నూతన ఈ ఓ గా భాద్యతలు చేపట్టిన పి .శ్రీనువాసుల రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెంచలకోన ఈవోగా పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డి బదిలీపై మాలకొండ ఈ ఓ గా నియమించారు. మాలకొండలో పనిచేస్తున్న ఈవో చంద్రశే ఖర్ బదిలీపై శ్రీశైలం డిప్యూటీఈవోగా బదిలీ అయ్యారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన ఈవో శ్రీనివాసల రెడ్డికి ఆలయ వేదంపండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అంతకుముందు ఈవో ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

# 'సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**తాడేపల్లి/అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు కూడా వస్తున్నాయని అన్నారు. తాడేపల్లిలోని ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో అధిక డిమాండ్ ఉందని, వాటి వల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులు లేని సాగును సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు.

**సైకిల్ పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి... .** అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలో మీటర్ల దూరంలో ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధతులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామ పండను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ నే వినియోగించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డు వద్ద ఉన్న చలివేంద్రం వద్ద ఆగి, మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం... జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి. మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. ముఖ్యంగా వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com